క్లుప్తంగా

నేడు పుస్తకావిష్కరణ

బోథ్: ప్రముఖ కథా రచయిత బోరె మురళీధర్ రాసిన 'బొంతలసీమ బతుకు చిత్రాలు' పుస్తకావిష్కణ కార్యక్రమం ఆదివారం సొనాలలోని రామాలయంలో నిర్వహించనున్నట్లు రామాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆకాశవాణి విశ్రాంత స్టేషన్ డైరెక్టర్ సుమనస్పతి రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీలో చేరిక

జైనథ్: పెండల్‌వాడ గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు సంజయ్, వార్డ్ మెంబర్ అశోక్‌కు బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ క్యాంపు కార్యాలయంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. వారి వెంట బీజేపీ నాయకులు అశోక్ రెడ్డి, నాగుల నరేశ్, తదితరులు ఉన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ఉయిక భీంరావ్ ఇటీవల ప్రమాదానికి గురవడంతో బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్, సుభాష్, రాజులు ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రమణగౌడ్, సోలంకి సత్యనారాయణ ఉన్నారు.

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన నాయకులు కుమ్మరి వెంకటరమణ మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో ఎంపీపీ తుల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు శనివారం ఆయనను పరామర్శించారు. బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్, శ్రీధర్ రెడ్డి, రాజు, ప్రశాంత్, భోజన్న ఉన్నారు.

తీన్మార్ మల్లన్నకు పీఆర్టీయూ మద్దతు

ఎదులాపురం: వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్నకు పీఆర్టీయూ మద్దతు తెలుపుతున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆడే నూర్‌సింగ్ నాయక్, నర్ర నవీన్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలకుల తప్పిదాలను ప్రజల గొంతుకగా ఎత్తి చూపడమే కాకుండా, ప్రజలను చైతన్య పరచడంలో నూతన ఒరవడిని సృష్టించారని అన్నారు. ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్ననే గెలిపించాలని సంఘం నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఉదయం పూటే పనికి వెళ్లాలి

సిరికొండ: ఉపాధిహామీ కూలీలు ఉదయం పూటే పనికి వెళ్లాలని ఏపీవో భీంరావ్ టీఏలకు, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి మేట్‌లకు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి కూలీల కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను టీఏలకు పంపిణీ చేశారు. టెంట్, తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

బోథ్: జూన్ 8న జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ కోరారు. శనివారం కోర్టు ప్రాంగణంలో వివిధ మండలాల పోలీసు, అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజీకి అవకాశమున్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీధర్, పోలీసు, అధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మార్కెటింగ్ ఏడీఏ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డును సందర్శించి జొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. దళారులకు సహకరించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ పాల్గొన్నారు.

బేలలో డిగ్రీ పరీక్ష కేంద్రం హర్షణీయం

బేల: బేల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. గత పాలకులు, కాకతీయ యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యంతో బేలలోని డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని 40 కిలోమీటర్ల దూరంలోని ఆదిలాబాద్‌కు తరలించడం జరిగిందన్నారు. ఈ పరీక్ష కేంద్రం ఏర్పాటుతో ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఏబీవీపీ నాయకులు శివ నిత్వార్ ఓం ప్రకాష్, పాయల్ సాయి, వంశీ, పవన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బండి సంజయ్ ప్రచారంలో పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం కొత్తపల్లి పట్టణంలో ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ ప్రచారంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ శనివారం పాల్గొన్నారు. బండి సంజయ్ హిందుత్వం కోసం, బీజేపీ కోసం అలుపెరగకుండా పోరాటం చేస్తున్నారని అన్నారు.

నీటిని ఒడిసిపట్టేదెలా?

- పట్టణంలో ఇంకుడుగుంతలు 164 మాత్రమే
- నిర్మాణాలపై దృష్టి సారించని ప్రజలు
- అవగాహన కల్పించడంలో బల్దియా విఫలం


ఇంకుడు గుంతలపై సర్వే చేస్తున్న బల్దియా సిబ్బంది

కైలాస్‌నగర్: నీటి ఎద్దడిని నివారించేందుకు వర్షపు నీటిని సంరక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తోంది. వర్షపునీరు వృథా పోకుండా ప్రతీ భవన నిర్మాణం చేపట్టే సమయంలో ఇంకుడు గుంతలను నిర్మించాలని ఆదేశాలున్నాయి. భవనం నిర్మాణం చేపట్టే సమయంలో ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నట్లుగా అనుమతులు తీసుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం వాటి నిర్మాణాలు కనిపించడం లేదు. గ్రేడ్ 1స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాల్టీలో మొత్తం 164 ఇంకుడు గుంతలు ఉన్నట్లుగా అధికారులు నిర్ధారించడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

నీటి ఎద్దడిని నివారించేలా...

రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న ఆదిలాబాద్ పట్టణంలో మొత్తం 48,393 నివాస గృహాలున్నాయి. తాజాగా భూగర్భజలాలు అడుగంటిపోయి, తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చుతుండటాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. నీటి ఎద్దడి నివారణకు ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా పట్టణాల్లో ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత ఉండేలా చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. 300 స్క్వేర్ మీటర్, ఆపై స్థలం కలిగిన భవన నిర్మాణాల్లోని ఇంకుడుగుంతల స్థితిగతులను పరిశీలించాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. వాటికనుగుణంగా రంగంలోకి దిగిన బల్దియా యంత్రాంగం ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు నివాస గృహాల్లో ఇంటింటికీ వెళ్లి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు.

కేవలం 164 ఇంకుడు గుంతలే

బల్దియా అధికారుల సర్వేతో ఆదిలాబాద్ పట్టణంలోని ఇంకుడుగుంతల నిర్మాణల పరిస్థితి బయటపడింది. పట్టణంలో రోజురోజుకూ నిర్మాణాలు ఎత్తున జరుగుతున్నాయి. కానీ ఇంకుడు గుంతలు మాత్రం కేవలం 164 మాత్రమే ఉన్నట్లుగా అధికారులు నిర్ధారించడం నీటి సంరక్షణ దుస్థితికి అద్దం పడుతుంది. అధికారుల నివేదిక ప్రకారం ప్రభుత్వ భవనాల్లో 69, ప్రైవేట్ భవనాల్లో 95 చొప్పున 164 మాత్రమే ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ కార్యాలయాల్లో 30, ప్రైవేట్ కార్యాలయాల్లో 39 చొప్పున 69 మాత్రమే ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయి. మరో 29 ఇంకుడు గుంతలు నీరు ఇంకే పరిస్థితి లేక మరమ్మతులు చేయాల్సి ఉందని అందుకోసం రూ.2.50లక్షల నిధులు ఖర్చవుతాయని అధికారులు గుర్తించారు.

లోపించిన పర్యవేక్షణ, అవగాహన

పట్టణంలో ఇంటి నిర్మాణం కోసం అనుమతి తీసుకునే సమయంలోనే ఇంకుడుగుంత నిర్మాణం చేపట్టాలని పేర్కొంటూ.. దాన్ని నిర్మిస్తేనే ఇంటి నిర్మాణానికి అనుమతి ఇస్తామని స్పష్టం చేసింది. దీంతోనైన ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రజలు దృష్టిసారిస్తారని భావించింది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం నిర్మాణాలకు అనుమతి తీసుకుంటున్నా.. వాటిని నిర్మించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. వాటిని నిర్మించేలా చూడాల్సిన మున్సిపల్ అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు.

ఇంకుడుగుంత తప్పనిసరి

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత నిర్మాణం తప్పనిసరిగా చేపట్టాలి. ప్రభుత్వం కూడా ఇదే సూచిస్తుంది. పట్టణంలో సైతం ఇంకుడు గుంత నిర్మిస్తేనే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలున్నాయి. ఆదిశగా పట్టణ ప్రజలు భవన నిర్మాణ సమయంలో ఇంకుడుగంతలను తప్పనిసరిగా నిర్మించుకోవాలి.
– ఎండి.ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

మండు వేసవిలో నిండుకుండలా..


తాంసి: భానుడి ప్రతాపంతో ఇప్పటికే వాగులు, చెరువులు, ప్రాజెక్టులు అడుగంటాయి. కానీ తాంసి మండలం కప్పర్ల గ్రామ శివారులో ఉన్న కుంట చెరువు మాత్రం మండు వేసవిలోనూ నిండుకుండలా కళకళలాడుతోంది. గ్రామస్తులు నీటిని వృథా చేయకుండా చెరువు నీటిని పొదుపుగా వినియోగించుకున్నారు. ప్రస్తుతం నిండుకుండలా ఉన్న చెరువు పశువుల దాహార్తి తీర్చేందుకు ఉపయోగపడుతోంది.

కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పాలి


ప్రచారం చేస్తున్న జోగు ప్రేమేందర్, నాయకులు


నినాదాలు చేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కాంగ్రెస్, కేంద్రలో పార్టీ , పదేళ్ల అధికారంలో ఉండి ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేసిన బీజేపీ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు మద్దతుగా శనివారం పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. గ్యాస్ సిలిండర్, పెట్రోల్, నిత్యావసర సరకుల ధరలను భారీగా పెంచి సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి రమేశ్, భరత్, స్వరూప రాణి, మమత, కోవ రవి, బాదన్ గంగన్న, పందిరి భూమన్న, వినోద్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను నమ్మొద్దు'

ఇచ్చోడ: ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను నమ్మవద్దని బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గేర్జం గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముండే పాండరంగ్, మహిముద్, మహేందర్‌రెడ్డి, రాథోడ్ ప్రవీన్, సాబీర్, గణేష్ పాల్గొన్నారు.

ఆత్రం సక్కును గెలిపించాలి

బోథ్: ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అల్లకొండ ప్రశాంత్, సురేందర్ యాదవ్, ఎల్క రాజు, మల్లెపూల సుభాష్, సత్యనారాయణ, రమణ గౌడ్, ప్రవీణ్, రఫీ, వాహీద్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే పేదోడికి బలం'


బేల: ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

గుడిహత్నూర్: కాంగ్రెస్‌తోనే పేదోడికి బలం చేకూరుతుందని జిల్లా కాంగ్రెస్ పార్లమెంటరీ నాయకుడు కోవ దౌలత్‌రావ్ మోకాశి అన్నారు. శనివారం మండలంలోని కొద్దుగూడ, డోంగర్‌గావ్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భారీ మెజార్టీతో ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. మండలాధ్యక్షుడు మల్యాల కరుణాకర్, నాయకులు మాజీద్, ఆడే సునీల్, షకీల్, శేఖర్, ఆవుల రమేశ్ పాల్గొన్నారు.

'మతతత్వ పార్టీని ఓడించాలి'

బేల: పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని చప్రాల గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు విలాస్ పటేల్, గోపత్ శంకర్, అనిల్ దోటే, సాగర్, హనుమంత్‌రెడ్డి, విలాస్ జాదవ్, బాపురావు పాల్గొన్నారు.

తలమడుగు: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. శనివారం తలమడుగు మండల కేంద్రంలో పూలాజీ బాబా ధ్యాన మందిరంలో పూజలు చేశారు. అనంతరం ఇంటింకీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశ అభివృద్ధిని బీజేపీ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. నాయకులు కల్యాణం రాజేశ్వర్, ప్రకాష్ రావు, భూమారెడ్డి, బాబన్న, పోచ్చన, సునీతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు కేస్లాపూర్, హర్కపూర్, దోందదా, గట్టెపల్లి, అంజీ గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నికల ప్రచారం చేశారు. ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ముఖడే ఉత్తం, సోమోరే నాగోరావ్, మెస్రం నాగ్‌నాథ్, ఎండీ మసుద్, జహీర్, సిడాం జంగు పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్, గోన గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ హయాంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు ఓటర్లకు వివరించారు. అశోక్, వినోద్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, దేవారెడ్డి పాల్గొన్నారు.

బోథ్: తెలంగాణ రాష్ట్రంలో మెజార్టీ పార్లమెంట్ సీట్లు కైవసం చేసుకుంటున్నామని ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ అన్నారు. శనివారం బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామంలో పర్యటించారు. ఆత్రం సుగుణ విజయం ఖాయమన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, జావిద్ అహ్మద్, లక్ష్మణ్, శివ, అబూద్ పాల్గొన్నారు.

ఎదులాపురం: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉషాకిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ పెట్టుబడిదారి వ్యవస్థను పెంచి పోషిస్తుందని ఆరోపించారు. దేవరామ, శ్రీను, సురేశ్, పాల్యా నాయక్, రాందాస్ పాల్గొన్నారు.


తలమడుగు: ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి


కైలాస్‌నగర్: కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

కై లాస్‌నగర్: కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదివాసీ బిడ్డ ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్‌రెడ్డి కోరారు. సుగుణకు మద్దతుగా శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్ , శంకర్ గుట్ట కాలనీల్లో ప్రచారం చేశారు. మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, దామోదర్ రెడ్డి, రహీమ్ ఖాన్, లింగన్న పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సతీమణి సాయి మౌనిక రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. పట్టణంలో మహాలక్ష్మివాడ, జైజవాన్ నగర్, చిలుకూరి లక్ష్మి నగర్, తిర్పెల్లి, బంగారిగూడ కాలనీలో పర్యటించారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి


మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

ఎదులాపురం: వేసవిలో ఎండ నుంచి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యాక్టివ్ కన్స్యూమర్ ఫోరం (ఏసీఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఎలప్రేల్‌వార్ సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శనివారం ఏసీఎఫ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేలో ఎండలు ముదురుతున్న తరుణంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించామన్నారు. వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లు రశీదు పొందాలన్నారు. ఫోరం బాధ్యులు తార్పే తులసి, ఏగంటి రాజు, రమేశ్, కె.విశ్వనాథ్, భూమన్న పాల్గొన్నారు.

'ఆకునూరి మురళిపై చర్యలు తీసుకోవాలి'


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బోథ్: మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి కాంగ్రెస్ పార్టీకి ఏజెంట్‌గా పని చేస్తున్నారని బోథ్ బీజేపీ నాయకులు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో దక్షిణమధ్య రైల్వే బోర్డు సభ్యులు జీవి.రమణ, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, మండల కన్వీనర్ బోరె రవీందర్‌లు నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఓటరు చైతన్యయాత్ర పేరుతో గ్రామాల్లో తిరుగుతూ బీజేపీపై విమర్శలు చేస్తున్నారని, ఓటర్లను కాంగ్రెస్ వైపు తిప్పుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, జక్కుల వెంకటేశ్, కాని మురళి, అశోక్ రెడ్డి, వెంకటేశ్, నల్ల గంగయ్య, బారె భోజన్న, నర్సింహదాస్, తదితరులు పాల్గొన్నారు.

'మోదీ హయాంలో దేశం సురక్షితం'


నేరడిగొండ: ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు


బోథ్: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

తాంసి: గడిచిన పదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశం సురక్షితంగా ఉందని, మరోసారి బీజేపీని గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మనంద్ కోరారు. శనివారం భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజు, రాకేశ్, అశోక్, ప్రవీణ్ రెడ్డి, సన్ని, కమల్, నారాయణ, మల్లేష్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండలంలోని చిన్నమన్నూర్, మామిడిగూడ, శంభుగూడ, భీంపూర్ గ్రామాల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మనంద్ ప్రచారం చేశారు. బీజేపీ చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు కేంద్రే శివాజీ, వైస్ ఎంపీపీ భరత్, కేంద్రే లక్ష్మణ్, సుధాకర్ రెడ్డి, కేశవ్ గిత్తే, వామన్ గిత్తే పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని కజ్జర్ల, దేవాపూర్ గ్రామాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మనంద్ ప్రచారం నిర్వహించారు. మోదీ పాలనను చూసి ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కనపర్తి చంద్రకాంత్, స్వామి, మహేందర్ యాదవ్, బోండ్ల వెంకటస్వామి, స్వామి, దాతాజీ కిరణ్, దేవన్న, ధాంజీ పటేల్, సుభాష్ పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని చిన్న బుగ్గారాం, పెద్ద బుగ్గారాం, పట్‌పటితండా, మాట్లొద్ది, బందంరేగడి, చింతగూడ, పెద్ద గొండుగూడ, అర్కగూడ, కొరటికల్(కె), కొరటికల్(బి) గ్రామాల్లో నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గోడం నగేశ్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవులు, పరుశురాం, గట్టు నారాయణ, కమల్ సింగ్, కొట్నక్ కోటేష్, మండాడి క్రిష్ణ, భీంరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: సుస్థిర పాలన కోసం బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కదం బాబారావు అన్నారు. శనివారం మండలంలోని గుండి, గుండివాగు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. దేశ భద్రత బీజేపీతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మాటలను నమ్మవద్దన్నారు. నాయకులు కేంద్రే నారాయణ, తృప్తి గంగాధర్, సాయ రెడ్డి, అంబేకర్ పాండురంగ్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: దేశ ఉజ్వలమైన భవిష్యత్ కోసం, దేశ అభ్యున్నతి కోసం కమలం పువ్వు గుర్తుకే ఓటు వేసి, ఎంపీగా గోడం నగేశ్‌ను గెలిపించాలని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత అన్నారు. శనివారం భీంజితండా, దస్నాపూర్, దస్నాపూర్‌గూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి రాజలింగు, జైస్వాల్ శివ కుమార్, మరప రాజు, భీంరావ్ పాల్గొన్నారు.

తాంసి: మండలంలోని గిరిగాం, అంబుగాం, లీమ్‌గూడ గ్రామాల్లో శనివారం బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, మరోసారి ప్రధానమంత్రిగా మోదీని గెలిపించాలని కోరారు. ప్రచారంలో జెడ్పీటీసీ రాజు, సంతోశ్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సదానంద్, నారాయణ, సుభాశ్, పొచ్చన్న పాల్గొన్నారు.


ఇంద్రవెల్లి: ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ పుష్పలత

బోథ్: సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యమని రైల్వే బోర్డు సభ్యులు జివి.రమణ, మండల కన్వీనర్ బోరె రవీందర్‌లు అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి, గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు.

సభ విజయవంతం చేయండి

బోథ్: నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈనెల 5న నిర్వహించే రాహుల్‌గాంధీ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు దౌలత్ రావు కోరారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో మాట్లాడారు. సత్యనారాయణ, మల్లేష్, సల్ల రవి, మల్యాల కరుణాకర్, శేఖర్, రాజేశ్వర్ రెడ్డి, రమణ రెడ్డి, గంగారెడ్డి, నారాయణ, ప్రవీణ్, భోజన్న, చిన్నయ్య పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలో చౌహాన్ రమేశ్ స్మారకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ సర్పంచ్ చౌహాన్ సునీత శనివారం ప్రారంభించారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.